

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 14-07-2026 సంపుటి : 08 సంచిక 32 పేజీలు : 8 వెల : రూ 3-00


## గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ: సీఎం చంద్రబాబు




రాజమండ్రి, జులై 13: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదని.. కొట్టుకుపోయినా పట్టించుకోలేదంటూ వైసీపీపై మండిపడ్డారు. గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్ధరణ చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్‌లో 72 శాతం పనులను పూర్తి చేశామని.. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయన్నారు. పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశామని చెప్పుకొచ్చారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభిమానులు ఎక్కువని అన్నారు. పవన్ భుజానికి శస్త్ర చికిత్స జరిగిందని.. ముంబై వెళ్లి ఆయనను పరామర్శించినట్లు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడ్డాకే విధుల్లోకి రావాలని పవన్‌కు చెప్పానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు



అమరావతి, జులై 13: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించి.. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందనే దానిపై చంద్రబాబు ఆరా తీయగా.. 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని అడుగగా.. 14,700 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. చివరి భూములకు నీరందేలా చూసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గోదావరి, కోనసీమ అందాల సీమ అని పేరుందని... దాన్ని నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## వరుస పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు..

### ఛాత్రోన్ కీ గూంజ్‌కి పిలుపు..

న్యూఢిల్లీ: భారత విద్యా వ్యవస్థపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయితీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆయన ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు, అవినీతిపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఎంపీ రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లేని వ్యవస్థ అనే పదాలు తనవి కాదని రాహుల్ అన్నారు. అవి భారత విద్యా వ్యవస్థ గురించి విద్యార్థులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలని ఆయన పేర్కొన్నారు.



'వాస్తవం ఏమిటంటే.. భారత విద్యా వ్యవస్థ ఇప్పుడు ఒక నిజాయితీ లేని దోపిడీ యంత్రాంగంగా మారింది. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ.. వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోంది' అంటూ రాహుల్ ఆరోపించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే పేపర్ లీక్ మాఫియాకు కారణమైందని ఆయన విమర్శించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి కష్టపడిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని రాహుల్ ధ్వజమెత్తారు. వీటన్నింటినీ చూస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ముఖం చాటేస్తోందన్నారు. అలాగే దీనిని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు. దేశ విద్యా రంగంలో విప్లవం అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరై విద్యార్థుల గొంతుకను మరింత బలంగా వినిపిద్దామన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఛాత్రోన్ కీ గూంజ్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన లింక్‌ను ఎంపీ రాహుల్ గాంధీ తన పోస్టులో షేర్ చేశారు.

## ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు.. ఓపీఎస్ ఎంపికకు వన్‌టైమ్ ఛాన్స్



అమరావతి, జులై 13: ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53ను(ఉ.నా.ఓూ.ఔని. 53) విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జీవో జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపీఎస్ లేదా సీపీఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పరిధిలోనే కొనసాగుతారని జీవోలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

## ముంబై ఆస్పత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం దేవేంద్ర ఫడణవీస్



ముంబై జులై 13 ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. అనంతరం ముంబైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఫడణవీస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు ఆరా తీశారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలుకరించుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

## సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు పోస్టింగులు చేస్తే కఠిన చర్యలు: హోం మంత్రి అనిత

అనకాపల్లి జిల్లా, జులై 13 : సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లుగా పోస్టింగ్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అనకాపల్లి జిల్లాలో సైబర్, సోషల్ మీడియా కేసులు పెరిగాయని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను హోం మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న పీజేఆర్ఎస్ మంచి ఫలితాలను ఇస్తోందని హోం మంత్రి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. జిల్లాలో ఈ ఏడాది క్రైమ్ రేట్ 15 శాతం తగ్గిందని వెల్లడించారు. జిల్లాలో మహిళలపై చేసే దాడుల్లో క్రైమ్ రేటు 7 శాతం తగ్గిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.







# సంపాదకీయం

మంగళవారం 14-07-2026

## డిఫెన్స్ రంగంలోకి భారత్

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది.భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి. ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది.కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు..

### సిట్ నివేదిక కోరిన సుప్రీంకోర్టు.. వచ్చే వారం విచారణ!

ఢిల్లీ, జులై 13: అయోధ్యలోని ప్రతిష్ఠాత్మక శ్రీరామ మందిరానికి భక్తులు సమర్పించిన నగదు, విలువైన వస్తువుల విరాళాల దుర్వినియోగం, చోరీ కేసు దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు పర్యవేక్షణలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేత ఈ కేసుపై విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను వచ్చే వారం విచారిస్తామని కోర్టు పేర్కొంది.భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కేంద్ర ప్రభుత్వానికి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది.విచారణ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేయడాన్ని సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించినప్పటికీ, ధర్మాసనం మాత్రం ట్రస్ట్‌కు కూడా నోటీసులు పంపడానికే మొగ్గు చూపింది. విచారణ బృందంలో ఎవరున్నారు? ఇప్పటివరకు దర్యాప్తు ఎక్కడిదాకా వచ్చింది? అనే పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని యూపీ ప్రభుత్వ 'సిట్' ను ఆదేశించింది.విచారణ సందర్భంగా సొలిసిటర్



జనరల్ స్పందిస్తూ.. 'సిట్' దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. దీనిపై పిటిషనర్లు తమకు కూడా ఆ కాపీ కావాలని కోరగా, సొలిసిటర్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పుడు సీజేఐ స్పందిస్తూ.. 'మీకు చట్టం తెలుసు కదా.. ఎలాగైనా చివరికి వారు ఆ నివేదికను చూస్తారు' అని వ్యాఖ్యానించారు. అలాగే కోర్టులో గట్టిగా మాట్లాడుతున్న ఒక న్యాయవాదితో.. 'మీరు ఇక్కడ కేకలు వేయాల్సిన అవసరం లేదు, మీ గొంతును బయట వాడుకోవడానికి దాచుకోండి' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.అయోధ్య రామాలయంలో భక్తులు కానుకలుగా సమర్పించిన భారీ మొత్తంలో నగదు, ఇతర విలువైన వస్తువులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు రావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ ఆరోపణలపై విచారణకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ అధ్యక్షతన ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. 'సిట్' తన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. జులై 1న దర్యాప్తును పూర్తిగా ముగించడం కోసం యూపీ ప్రభుత్వం 'సిట్' గడువును మరో 15 రోజులు పొడిగించింది.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. విరాళాల నిర్వహణ వ్యవస్థను, దానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడానికి 'సిట్' బృందం మరోసారి అయోధ్యను సందర్శించనుంది. ఇందులో భాగంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు చెందిన నిర్వాహకులను, ఆలయ నిధుల నిర్వహణతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను కూడా దర్యాప్తు బృందం ప్రశ్నించే అవకాశం ఉంది.ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు దశలో ఉన్నందున, ఇప్పటివరకు జరిగిన పురోగతిని పరిశీలించిన తర్వాతే తాము తదుపరి ఉపశమనాలు లేదా సీబీఐ విచారణపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

## విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట..

### గోవధ నిషేధ ఉత్తర్వులపై స్టే!

న్యూఢిల్లీ, జులై 13: తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెత్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది.బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది.హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'చట్టంలోని నిబంధనలు ఓ నిర్దిష్ట ప్రక్రియకు అనుమతిస్తున్నప్పుడు, దానికి విరుద్ధంగా కోర్టులు న్యాయపరమైన ఆదేశాలు జారీ చేయడం చట్టబద్ధంగా చెల్లదు'. అని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది.మద్రాస్ హైకోర్టుకు చెందిన జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 1976 నాటి ఓ ప్రభుత్వ ఉత్తర్వును (జీఓ) ఆధారంగా చేసుకుని ఈ నిషేధాన్ని



విధించింది. పాల ఉత్పత్తిని పెంచడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి 1976లో గోవధను నిషేధిస్తూ ఆ ఉత్తర్వు ఇచ్చారు. తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, ఇతర పాడి పశువుల వధను నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో కూడా శ్రీకృష్ణుని కాలం నుంచి ఆవు మన నాగరికతతో ముడిపడి ఉన్న అత్యంత గౌరవనీయమైన జంతువుగా పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు.తమిళనాడులో సంప్రదాయకంగా బక్రీద్ పండుగ సమయంలో ముస్లింలు స్థానిక నిబంధనలకు లోబడి ప్రైవేట్ ప్రాంగణాల్లో లేదా మతపరమైన ప్రార్థనా స్థలాలలో జంతు బలులు ఇస్తారు. అలాగే, రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలలో జరిగే వార్షిక ఉత్సవాల్లో కూడా జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన కసాయిఖానాలకే పరిమితం చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, పండుగ రద్దీని తట్టుకునే సామర్థ్యం ఆయా కేంద్రాలకు లేదని కమ్యూనిటీ నాయకులు వాదిస్తున్నారు.తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం' ఇతర నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయని స్పష్టం చేసింది. జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించాలనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, అయితే పూర్తి నిషేధం చట్టంలో లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తమిళనాడులో ఈ వివాదానికి తాత్కాలిక బ్రేక్ పడింది.


## రాష్ట్ర చరిత్రలో దిగజారుడు భాష మాట్లాడిన సీఎం ఆయన ఒక్కడే

హైదరాబాద్ : రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు.రేవంత్ రెడ్డి నాకు ఎన్డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల




బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

## జమ్మూకశ్మీర్ సీఎంపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామంటూ నోటీసులు



న్యూఢిల్లీ,రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లీగల్ నోటీసు పంపింది. తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఒమర్ అబ్దుల్లా కొద్ది రోజుల క్రితం చేసిన ఆరోపణలే ఈ వివాదానికి కారణంకొద్ది రోజుల క్రితం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, 'మా పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలను బీజేపీ ప్రతినిధులు ప్రలోభపెట్టారు. రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నగదు, మంత్రి పదవులు ఇస్తామని ఆశచూపారు. అలాగే తమ పార్టీలో జాయిన్ అయితే జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెప్పారు' అని ఆరోపించారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు 'ఆపరేషన్ లోటస్' తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు ఒమర్ అబ్దుల్లా ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు తమపై చేసిన ఆరోపణలకు వెంటనే ఆధారాలు చూపాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బీజేపీ తరఫున ఒమర్ అబ్దుల్లాకు అధికారిక లీగల్ నోటీసు పంపారు. ఆరోపణలను నిరూపించలేకపోతే లేదా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

## తగిన చర్యలు ఉంటాయి: ఎస్. కృష్ణన్




న్యూఢిల్లీ: ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులకు సంబంధించిన అసభ్యకర వీడియోలు, చైల్డ్ అబ్యూస్ కంటెంట్‌కు సంబంధించిన ప్రకటనల వివాదంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తోంది. ఈ వ్యవహారంపై మెటా సంస్థ పంపిన వివరణ కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖకు చేరగా, దానిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. మెటా సమర్పించిన నివేదికను అన్ని కోణాల్లో పరిశీలించిన అనంతరం అవసరమైతే తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.ఇన్‌స్టాగ్రామ్‌లో చైల్డ్ అబ్యూస్ కంటెంట్ ప్రకటనలపై గతంలో కేంద్ర ప్రభుత్వం మెటాకు కఠిన నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని, ఇటువంటి కంటెంట్‌ను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. దీనికి స్పందించిన మెటా సంస్థ.. బాలల రక్షణకు ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని వెల్లడించింది. అలాగే యాడ్ రివ్యూ ప్రక్రియను మరింత బలోపేతం చేస్తామని తన వివరణలో పేర్కొంది.

## ఇరాన్ హిట్‌లిస్టులో ట్రంప్, నెతన్యాహు, మెలోనీ సహా 13 మంది విదేశీ నేతలు..!

పశ్చిమాసియా లో యుద్ధం ఆగినట్టే కనిపించినా ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇటీవల మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని, దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది.ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.అగ్రరాజ్యం చేస్తున్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.



# నిదానంగా సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

విజయవాడ, జూలై 13,రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, నమోదవుతున్న స్పందన ఆశించిన స్థాయికి చేరుకోలేదని సమాచారం. దీంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పురోగతి 50 శాతం మార్కును దాటలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ శాతం మరింత తక్కువగా ఉ ఒడటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. దీంతో నిర్ణయించిన గడువులోపు పూర్తి స్థాయిలో ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నగర ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినప్పటికీ, వాటిని పూర్తి వివరాలతో తిరిగి సమర్పించే విషయంలో ఓటర్ల నుంచి స్పందన తక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ కారణంగా మొత్తం ప్రక్రియ మందగించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాజకీయ పార్టీల దృష్టిలో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ఎన్నికల సమయంలో కీలక అంశంగా మారుతుంది. అందుకే అన్ని పార్టీలు తమ తమ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఫారాలు సకాలంలో సమర్పించేలా చూడాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని తెలుస్తోంది. ఫారాలు ఎలా నింపాలి, ఎవరికి ఇవ్వాలి, ఏ పత్రాలు అవసరం, పాత ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఏం చేయాలి వంటి విషయాల్లో ఇంకా సందిగ్ధత కొనసాగుతోందని సమాచారం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు, స్థానిక సిబ్బంది కలిసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.ప్రత్యేకించి 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు, లేనివారు అనుసరించాల్సిన విధానం గురించి కూడా ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని సూచిస్తున్నారు.గడువు ముగిసే వరకు మిగిలిన రోజుల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలను మరింత చురుకుగా రంగంలోకి దించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.మొత్తంగా చూస్తే, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. సరైన సమాచారం, అవసరమైన పత్రాలు, సమయానికి దరఖాస్తుల సమర్పణ వంటి అంశాలపై ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉంటేనే ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది. లేకపోతే తుది ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను

విశాఖపట్టణం, జూలై 13, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. “అడవి తల్లి బాట” వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# రావణ్ చుట్టూ రాజకీయం

విజయవాడ, జూలై 13, గత 10 రోజుల నుండి సోషల్ మీడియా , ఎలక్ట్రానిక్ మీడియా లో 'ప్రశ్న రావణ్' పేరు ఏ రేంజ్ లో మారుమోగిపోతుందో చూస్తూనే ఉన్నాం. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై పీకలదాకా నిండిన ద్వేషం తో , ఇష్టమొచ్చినట్టు బూతులు మాట్లాడడమే కాకుండా, హిందూ దేవుళ్లను దూషించడం, టెర్రరిస్టులకు , నక్సలైట్లకు సపోర్టుగా వీడియోలు చేయడం వంటివి చేసిన ఇతన్ని పోలీసులు ఉపా చట్టం క్రింద కేసులు నమోదు చేశారు. ఇతన్ని అరెస్ట్ చేయడాన్ని అందరూ సామర్థించారు, ఒక్క వైసీపీ పార్టీ శ్రేణులు , యాంటీ నేషనలిస్ట్ భావాలు గల ప్రకాష్ రాజ్ వంటి వారు తప్ప. అయితే నెల్లూరు జైలు లో రిమాండ్ లో ఉన్నటువంటి రావణ్ మొబైల్ ని పరిశీలించిన పోలీసులకు కొన్ని సంచలన నిజాలు తెలిసాయి , రావణ్ అకృత్యాలు , మోసాలు అన్నీ బయటపడ్డాయి.దీంతో అతనికి సపోర్టు చేసిన వారు ఒక్కొక్కరిగా జారుకున్నారు. వైసీపీ పార్టీ వాళ్ళు అయితే కొందరు రావణ్ లాంటోళ్లని మేమెందుకు చేరదీస్తామని తప్పుకునే ప్రయత్నం చేయగా, అంబటి రాంబాబు వంటి వారు రావణ్ కి వైసీపీ పార్టీ న్యాయ సహాయం చేస్తామని మాట ఇచ్చారు. మాట ఇవ్వడమే కాదు , న్యాయ సహాయం కూడా చేస్తున్నారు. దీంతో మొదటి నాలుగు కేసుల్లో రావణ్ కి బెయిల్ ఇప్పించిన జడ శ్రవణ్ వంటి వారు కూడా ఈ కేసు నుండి తెలివిగా తప్పుకున్నారు. ప్రకాష్ రాజ్ కూడా సైలెంట్ అవ్వడం తో , అతనికి నిజాలు తెలిసి సైలెంట్ అయిపోయారని , ఇప్పటికైనా బుద్ధితెచ్చుకున్నారని అంతా అనుకున్నారు. కానీ కట్ చేస్తే కాసేపటి క్రితమే ప్రకాష్ రాజ్ విడుదల చేసిన వీడియో సంచలనంగా మారింది. ఈ వీడియో లో ఆయన ఇప్పటికీ రావణ్ తప్పు చేసినట్టుగా ఒప్పుకోవడం లేదు .అతని కోసం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు ప్రకాష్ రాజ్. ఆయన మాట్లాడుతూ 'చాలా మంది నేను సైలెంట్ అయిపోయానని అంటున్నారు. నేనేమి సైలెంట్ అవ్వలేదు , మొత్తం చూస్తూ ఉన్నాను, మీరు ఎంత దిగజారిపోతున్నారో గమనిస్తూ ఉన్నాను. అసత్య ప్రచారాలతో నేరుగా ఎమ్మెల్యేలు , ఎంపీలు రంగం లోకి దిగడం, యూట్యూబర్లు , జనసైనికులు, కొన్ని అమ్ముడుపోయిన మీడియా చానెల్స్ చేస్తున్న ప్రచారాలను గమనిస్తున్నాను. వీటి అన్నిటికీ ఒక్కటే సమాధానం చెప్తున్నాను. దిగజారండి , ఇంకా ఇంకా దిగజారుతూనే ఉండండి, మీరు

## రంగంలోకి ప్రకాష్ రాజ్, గగన... దూరం పెడుతున్న జడ

ఎంత దిగజారిన ప్రపంచం మొత్తం మిమ్మల్ని గమనిస్తూనే ఉంది, మీరు ఏమి చేసిన ప్రశ్నించే గొంతుకని ఆపలేరు' అంటూ ఒక వీడియో ని విడుదల చేసాడు ప్రకాష్ రాజ్. దీనిపై నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గగన ఎవరు : ప్రధాన మీడియా పట్టించుకోలేదు. కానీ సోషల్ మీడియా ఊరుకోదు కదా.. లోతుగా తవ్వింది.. అసలు ఏం జరిగింది అని తెలుసుకుంది. చివరికి ప్రశ్న వెనుక ఉన్న అసలు ముసుగును బయటపెట్టింది. తద్వారా నిజం తెలిసింది. ఇంతకీ ఏం జరిగింది.. ఏపీలో ఈ పరిణామం దేనికి దారి తీయ పోతోంది..ఉపా చట్టం కింద బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అతడు ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ ఖైదీగా ఉన్నాడు. వాస్తవానికి రావణ్ ఒక్కడే కాదని.. అతను ఒక్కడు ఇదంతా చేయలేదని.. తెర వెనుక చాలా కథ ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. రావణ్ వెనుక ఉన్న అసలు కథను తవ్వితీయడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక మహిళ పేరు తెర మీదికి వచ్చింది. ఆమె పేరు గమన..ఇటీవల వైసిపి అధినేత జగన్ విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో కి వచ్చినప్పుడు గమన ఆయనను కలిసింది. అప్పుడు జగన్ ఆమె నెత్తి మీద చేయి పెట్టి ఆశీర్వదించారు. కచ్చితంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దానికి గమన ఉప్పొంగిపోయింది.. ధన్యోస్మి అన్న లెవెల్లో హావ భావాలు ప్రదర్శించింది. జగన్ ను కలిసిన తర్వాత గమన ఎవరు అనే చర్చ మొదలైంది. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టడంతో గమనకు సంబంధించిన అసలు విషయాలు బయటపడుతున్నాయి.ప్రశ్న యూట్యూబ్ ఛానల్ కు సీఈవోగా గమన వ్యవహరిస్తోంది. ఈ ఛానలకుసంబంధించిన ఫండింగ్ మొత్తం గమన సమకూర్చుతోంది. రావణ్ తో ఆమె అత్యంత సన్నిహితంగా ఉ ఒడేది. అతడితో కలిసి రీల్స్.. కాంట్రవర్షల్ పొలిటికల్ వీడియోలు కూడా రూపొందించేది. వైసిపికి అనుకూలంగా ఉండే సోషల్ మీడియా నెట్వర్క్ లో ఈమె తెరవెనుక అత్యంత కీలకపాత్ర పోషించిందని తెలుస్తోందిప్రశ్న యూట్యూబ్ స్టూడియో.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన రాజకీయ లింకులు మొత్తం విచారణలో బయటపడుతున్నాయి.. వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గం మాదినేని ఉమామహేశ్వర నాయుడు సోదరుడికి సంబంధించిన ఒక ప్లాట్ లో ఈ ఛానల్ స్టూడియో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కాంట్రవర్షల్ కంటెంట్.. ఇతర ప్రొడక్షన్ మొత్తం కూడా అక్కడి నుంచే కొనసాగుతోందని సమాచారం. అయితే దీని వెనుక అతిపెద్ద రాజకీయ కుట్ర కోణం ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. కీలకమైన డేటా మొత్తం స్వీకరించారు. ప్రస్తుతం ఈ కేసు తీవ్రమైన రూపు దాల్చడంతో.. పోలీసులు గమనికు అధికారికంగానే నోటీసులు ఇచ్చారు. రావణ్ మొబైల్ ఫోన్.. లాప్టాప్ మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలకమైన సమాచారాన్ని.. వీడియోలను పోలీసులు రికవరీ చేశారు.. ప్రశ్న బృందానికి ఇంతటి తెగింపు ఎక్కడిది.. వీరి వెనుక ఎవరున్నారు.. డబ్బులు ఎవరిస్తున్నారు.. అనే అంశాలను పోలీసులు బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

# పవన్ ట్రాప్ లో జగన్

నెల్లూరు, జూలై13, రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్ మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్



చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా వ ా ం ్ ం త ్ ం న ్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉ న్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

# ఆ ఇల్లే అందరికి ఆదర్శం


అనంతపురం, జూలై 13, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలోని నాగప్ప కుటుంబం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆరు తరాలుగా 80 మందికిపైగా కుటుంబ సభ్యులు కలిసి ఉంటూ.. ఉ మ్మడి కుటుంబానికి సరైన నిర్వచనం చెప్తున్నారు. ఆ ఇంట్లో పిల్లాపెద్దా అందరూ కలిసి 85 మంది వరకూ ఉంటారు. వీరిలో 25 మంది వరకూ విద్యార్థులే కావడం విశేషం. ఈ కుటుంబానికి వేరువేరు చోట్ల కలిపి 127 ఎకరాల వరకూ భూమి ఉంది. మగాళ్లు అందరూ ఈ భూమిలో సేద్యం పనులు చూస్తుంటారు. వీరందరికీ వేరువేరుగా ఇళ్లు ఉన్నా కూడా.. వంట మొదలుకుని సేద్యపు పనులు, ఆదాయం వరకూ అంతా ఉమ్మడిగానే జరుగుతుంది.నాగప్ప ఉమ్మడి కుటుంబంలో మొత్తం 85 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. అయితే అందరూ కలిసి ఒకేచోట వండుకుంటారు. కుటుంబంలోని మహిళలు అందరూ కలిసి.. ఉమ్మడి కుటుంబం మొత్తానికి కావాల్సిన వంట ఏర్పాట్లు చూస్తారు. ఒకే వంటగదిలో భోజనం తయారుచేస్తారు. కుటుంబం మొత్తానికి సరిపడాలంటే రోజూ 80 కిలోల బియ్యాన్ని వండాల్సి వస్తుందని మహిళలు చెప్తున్నారు. ఇక ఆదివారం రోజులలో నాన్ వెజ్ రుచిచూడాలంటే కనీసం 30 కేజీల మటన్ లేదా చికెన్ కావాల్సిందేనని చెప్తున్నారు. ఉదయం ఐదు గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటల వరకూ వంటగదిలో పొయ్యి మంట మండాల్సిందేనట.అయితే ఆరు తరాలుగా.. వీరంతా కలిసి ఉండటానికి బావా బావమరుదులు తీసుకున్న నిర్ణయమే కారణమట.. ఆరునూరైనా మనం కలిసే ఉందామంటూ అరవై సంవత్సరాల కిందట తీసుకున్న నిర్ణయమే వీరంతా ఇలా కలిసి ఉండటానికి కారణంగా చెప్తున్నారు. ఈ కుటుంబానికి మూలమైన నాగప్పకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒకే కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే తన పిల్లలు అందరూ ఒకేచోట కలిసి ఉండాలనే ఉద్దేశంతో నాగప్ప.. పెద్ద భార్య కూతురికి ఇల్లరికం పెళ్లి చేసి అల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దంపతులకు నలుగురు మగపిల్లలు సంతానం.వీరిలోని హనుమంతరాయుడు.. నాగప్ప రెండో భార్య కొడుకు ముత్యాలప్ప (బావమరిది) కలిసి తమ తాతగారి మాట ప్రకారం ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి వీరంతా కలిసే ఉ ంటున్నారు. ఈ ఇంట్లో కూడా ఎక్కువగా ఇల్లరికం వివాహాలే జరుగుతుంటాయి. అలా కొడుకులు, మనవళ్లూ, మనవరాళ్లూ, మునిమనవరాళ్లూ ఇలా అందరూ కలిసి 85 మంది అయ్యారు.ఈ కుటుంబానికి 127 ఎకరాల భూమి ఉంది. అలాగే70 వరకూ గేదెలూ, 40 ఆవులూ, వేయికిపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. సేద్యం ద్వారా ధాన్యం, కూరగాయలు పండిస్తున్నారు. ఇలా పండించిన వాటిలో కుటుంబ అవసరాలు పోనూ మిగతా వాటిని మార్కెట్లో విక్రయిస్తుంటారు.

# హోంశాఖపై అసంతృప్తులు...

కాకినాడ, జూలై 13, కూటమిలో కొద్దిపాటి కుదుపు.. హోం శాఖ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసులపై కినుక వహించారని తెలుస్తోంది. సోషల్ మీడియా కేసుల విషయంలో దూకుడుగా వ్యవహరించాలంటూ పోలీసు శాఖలోని టాప్ బాస్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన రెస్పాన్స్ రావడం లేదని ఆయన ఆగ్రహంగా ఉన్నాట.కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో రావణ్ అంశం నడుస్తోంది. ఓ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. దానికి జనసైనికులు ఆగ్రహం చెందడం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు కావడం జరిగింది. ఆ తర్వాత నిషేధిత సంస్థల ఐడియాలజీని ప్రోత్సహించేలా.. వీడియోలు రూపొందించారన్న విషయంపై రావణ్‌పై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసే వరకూ అది దారితీసింది.ఈ విషయానికే కొంత ఇబ్బందికర పరిస్థితి ఉన్న తరుణంలో.. ఇప్పుడు కూటమికి మరో సమస్య వచ్చింది.సోషల్‌మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు, తనపైన కానీ ప్రభుత్వంపైన కానీ.. సోషల్ హార్మోనీని దెబ్బతీసేలా పనిచేస్తున్న వారి విషయంలో కానీ పోలీసులు అనుకున్నంత వేగంగా.. స్పష్టంగా పనిచేయడం లేదని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రశ్న రావణ్ ఒక్కరే కాదు.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేయాలన్నది ఆయన అభిమతమని.. ఆ విషయంలో పోలీసు శాఖ చొరవ చూపించడం లేదన్న అసంతృప్తి ఆయనలో ఉంది. ఈ విషయాన్ని ఆయన నేరుగా ఓ పోలీసు ఉన్నతాధికారినే అడిగారని కూడా తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన విషయం ప్రకారం ఆయన చాలా సీరియస్‌గానే దీనిపై మాట్లాడారని.. కానీ పోలీసుల నుంచి తాను ఆశించిన సమాధానం రాలేదని తెలిసింది. దీనికి పవన్ కళ్యాణ్ నొచ్చుకున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత దానిని సర్దుబాటు చేయడానికి జనసేన– టీడీపీ నుంచి రెండు వైపులా ప్రయత్నాలు జరిగాయి. పోలీసులు ఈ విషయంలో మరింత దూకుడుగా లేకపోవడానికి కారణం.. చర్యలు తీసుకోవాల్సిన వ్యక్తులు తెలంగాణలో ఉండటం. ఇప్పటికే రావణ్, జర్నలిస్ట్ ఐఖీ అరెస్టుల వ్యవహారం తెలంగాణలో రచ్చకు దారితీసింది. ఏపీ పోలీసులు ఇష్టారాజ్యంగా వచ్చి ఇక్కడ నుంచి మనుషులు తీసుకెళు న్నారంటూ.. పొలిటికల్ పంచాయతీ నడిచింది. ఇప్పుడు ఇంకో స్టెప్ ముందుకు వేస్తే అది అనవసరంగా ఇబ్బందులకు దారితీస్తుందని వారు భావిస్తున్నారు. సాధారణంగా అరుదుగా నమోదు చేసే ఉపా చట్టాన్ని రావణ్‌పై పెట్టడంపై చర్చ నడుస్తోంది. దీనికి సరైన జస్టిఫికేషన్ పోలీసులు ఇవ్వాల్సి ఉంటోంది. చాలా మంది మాజీ ఎఖూ, ప్రజా సంఘాల వారు ఈ చర్యను తప్పు పడుతున్నారు. దీనిపై విజయవాడలో రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఉపాని రాజకీయ ప్రయోనాల కోసం వాడుతున్నారన్న భావనను ఈ సమావేశం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వం, పోలీసు శాఖపైన ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పుడు కొత్త తలనొప్పులు తలకెత్తుకోవడం ఎలా అని.. పోలీసు శాఖ అనుకుంటోంది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉ న్న పార్టీని ఒప్పించడం సవాల్‌గానే ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇంతకు ముందు కూడా ఇలాంటి సిచ్యువేషన్స్ ఎదురయ్యాయి. వాటిని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్లియర్ చేసుకుని వచ్చారు. పవన్ కళ్యాణ్ తన సర్జరీ కోసం ముంబై వెళ్లడంతో ఇవాళ కేబినెట్ మీటింగ్ కు హాజరుకాలేదు. ఇది ముందుగానే షెడ్యూల్ అయిన విషయం అయినా ఈ టైమ్‌లోనే ఇలా జరగడం కూడా కూటమిలో కొంచం కుదుపుకు కారణం అయింది.

## నేడు అమావాస్య సందర్భంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ జూలై 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో 14-07-2026 మంగళవారం అమావాస్య సందర్భంగా



సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాలగ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం, యశో,ధైర్యం, కార్యసిద్ధి, కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును. పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును.రుసుము 250-/ గుమ్మడికాయ -300/- సంప్రదించవలసిన నెం :- అశోక్కుమారాచార్యులు 9032577369 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777

## 16వ తేదీ గురువారం సూర్య దేవాలయంలో ప్రత్యేక ఆశ్లేషా బలి పూజ...



విభారే న్యూస్ జూలై 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో సూర్యనారాయణ స్వామి దేవాలయంలో 16/07/26 గురువారం రోజున ఉదయం 7.30 జరగబోవుఆశ్లేషా బలి పూజా వివరణ.పూజ ప్రధానం 11000/- సంకల్పం...1000ఆశ్లేషా బలి పూజ ద్వారా ఆశ్లేషా నక్షత్రం వారు, దీర్ఘకాల చర్మ వ్యాధులు,అనారోగ్య సమస్య,పితృ దోషాలు. సంతానం అభివృధి, వివాహ ప్రాప్తి, మానసిక ప్రశాంతత,సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహం సర్పదోషం నివారణ,సర్ప శాపం ద్వారా బాధ పడుతున్నవాళ్ళు ఈ ఆశ్లేషా బలి పూజలో పాల్గొని అనంతునియొక్క అనుగ్రహం పొంది సర్వ శుభాలను పొంది అనంతునియొక్క అనుగ్రహానికి పాత్రులు కాగలరు. సంప్రదించవలసిన నెం- ఆలయ అర్చకులు శేషసాయి శర్మ 7981012787ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబర్..08518-234388

## ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13-ఏపీ జేఏసీ అమరావతి నంద్యాల జిల్లా కమిటీ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడాన్ని స్వాగతించింది. ఈ నెల 10, 11 తేదీల్లో మంత్రుల కమిటీతో జరిగిన చర్చలు ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచాయని జిల్లా చైర్మన్ పి. రామచంద్రరావు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, త్వరలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలతో జరిగే సమావేశంలో కీలక నిర్ణయాలు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషనర్ నియామకం, మధ్యంతర భృతి (ఐఆర్), డీఏ బకాయిల విడుదల, సీపీఎస్ రద్దు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ సెలవులు తదితర 21 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. త్వరలో జరిగే సమావేశం అనంతరం ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు తెలిపారు.

## జొన్నల కొనుగోలుకు రైతుల ధర్నా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13: జొన్నలను ప్రభుత్వ మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గడివేముల మండలంలోని బిలకలగూడూరు, పెసరవాయి గ్రామాల రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.కొనుగోలుకు అనుమతి రాలేదని అధికారులు చెప్పడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం నుంచి కొనుగోలుకు అనుమతి వచ్చినట్లు సమాచారం అందిందని, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి నేడు లేదా రేపు కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని, గడివేముల మండల రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు జిల్లాలోని రైతుల వద్ద ఉన్న మొత్తం జొన్నలను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను 112 విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం.. - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

విభారే న్యూస్ జూలై 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 112 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1)పెరుమాళ్ల విజయ్ కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 34 వేలు తీసుకుని మోసం చేశాడని కృష్ణగిరి మండలం, పుట్లూరు గ్రామానికి చెందిన ఎస్.హుస్సేన్ ఫిర్యాదు చేశారు. 2)నా



కుమారుడు షణ్ముఖ మృతి పై అనుమానం ఉందని సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఓర్వకల్లు మండలం , హుసేనాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. 3) సెలూన్, బ్యూటీ పార్లర్, టాటూ స్టూడియోలకు ఫ్రాంచైజీ ఇస్తామని నమ్మించి అగ్రిమెంట్ చేసుకుని, మెటీరియల్ పేరుతో రూ. 60 లక్షలు తీసుకుని హైదరాబాద్ కు చెందిన మార్కెటింగ్ మేనేజర్ బృహస్పతిరావు, నరసరావుపేటకు చెందిన ఆశ్రఫ్ వలి మోసం చేశారని కర్నూలుకు చెందిన చకిత ఫిర్యాదు చేశారు. 4)నా తమ్ముడు ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి తనకు రావాల్సిన తండ్రి ఉద్యోగం రాకుండా మోసం చేశాడని కర్నూలు,ఎర్ర బురుజుకు చెందిన అరుణ జ్యోతయ్య ఫిర్యాదు చేశారు. 5)కొడుకు కోడలు ఆస్తికోసం వేధింపులకు గురి చేస్తున్నారని కల్లూరు కు చెందిన నాగేశ్వరావు ఫిర్యాదు చేశారు. 6)నా తమ్ముళ్ళు, మామ,అత్తల నుంచి ఉద్యోగాల పేరుతో రూ. 60 లక్షలు తీసుకొని మోసం చేసిన కల్లూరుకు చెందిన నాయకంటి మహేశ్వరి పై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం,లక్ష్మీపురం కు చెందిన పార్వతమ్మ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్--

### పీజీఆర్ఎస్‌లో 334, రెవెన్యూ క్లినిక్స్‌లో 193 అర్జీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13: ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రతి అర్జీని నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి



సంతృప్తికరంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పరిష్కార నివేదికలపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంతకం చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు కార్యాలయాలకు రాకుండానే ప్రభుత్వ సేవలు అందేలా వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈసారి పీజీఆర్ఎస్‌లో మొత్తం 334 అర్జీలు, రెవెన్యూ క్లినిక్స్‌లో 193 అర్జీలు స్వీకరించినట్లు వెల్లడించారు. వీటిలో భూ వివాదాలు, సర్వే, ఆర్‌వోఆర్, అసైన్డ్ భూములు, 22-ఎ, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించిన వినతులు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.పీజీఆర్ఎస్‌లో జూపాడుబంగ్లా, ఆళ్లగడ్డ, కొత్తపల్లి మండలాలకు చెందిన భూ సమస్యలపై వచ్చిన ప్రధాన అర్జీలను సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## రూ.50 లక్షల డ్రైనేజీ పనులకు మంత్రి ఫరూక్ శంకుస్థాపన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13 : నంద్యాల పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న



నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు కల్పించడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఫరూక్ తెలిపారు. నంద్యాల మొదటి వార్డులోని పీవీ నగర్ స్వర్గదామం సమీపంతో పాటు 21వ వార్డులో నూతన డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, మున్సిపల్ ఇంజనీర్ నాగభూషణం రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మధుసూదన్, పిచికే సుమలత, పబ్బతి వేణు, గురుప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నంద్యాల నవ నిర్మాణ సమితి ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రకు మార్కెట్ ప్రసాద్ కు ఆహ్వానం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13: నంద్యాల పట్టణంలో తొలిసారిగా ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర అమ్మవార్ల దివ్య రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై జగన్నాథ స్వామివారి దివ్య దర్శనం పొందాలని మార్కెట్ ప్రసాద్ పిలుపునిచ్చారు.ఇస్కాన్ సంస్థాపక ఆచార్య ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల దివ్య ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ రథయాత్రకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. జగన్నాథ స్వామివారి రథాన్ని దర్శించడం, రథయాత్రలో పాల్గొనడం ద్వారా భక్తులకు విశేషమైన పుణ్యఫలం లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయని తెలిపారు.ఈ బృహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులను ఆశీర్వదించాలని ఇస్కాన్ సభ్యులు మార్కెట్ ప్రసాద్‌ను గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రథయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నంద్యాల ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర దేవతల దివ్య దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని ఆయన కోరారు.రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇస్కాన్ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## జులై 25న నంద్యాలలో మహా సత్యాగ్రహ దీక్ష--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 13: ప్రజా ఆస్తుల పరిరక్షణ, నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ జులై 25న నంద్యాలలో మహా సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని అఖిలపక్ష ఐక్యవేదిక నిర్ణయించింది.సోమవారం కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రభుత్వ స్థలాలు లేవని చెబుతూ ఆర్ఏఆర్ఎస్‌లో కలెక్టరేట్ కొనసాగిస్తూనే, రాజకీయ పార్టీలకు ప్రజా ఆస్తులు కేటాయించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని నాయకులు విమర్శించారు.జులై 25 వరకు 100 బృందాలతో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి సత్యాగ్రహానికి ప్రజల మద్దతు కూడగట్టాలని నిర్ణయించారు. మార్కెట్ యార్డు భూమి కేటాయింపును రద్దు చేయాలని, ఆర్ఏఆర్ఎస్ నుంచి కలెక్టరేట్‌ను తరలించాలని, రైతు ప్రయోజనాల కోసం వ్యవసాయ పరిశోధన సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి, శంకరయ్య, బెక్కం రామసుబ్బారెడ్డి, మస్తాన్, ఏజాస్ హుసేన్, జానయ్యతో పాటు వివిధ రైతు, ప్రజా, రాజకీయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నంద్యాల సబ్ రిజిస్ట్రార్‌గా అజిమియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13: నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం?1 (ఎస్ఆర్వో?1) నూతన సబ్ రిజిస్ట్రార్‌గా అజిమియా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై నంద్యాలకు నియమితులైన ఆయన, కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టి సిబ్బందితో సమావేశమయ్యారు.అజిమియా గతంలో కల్లూరు, కోవెలకుంట్ల, అనంతరం డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి విశేష పరిపాలనా అనుభవాన్ని సంపాదించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ సేవలు అందించడం, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కార్యాలయ పనితీరును మరింత



సమర్థవంతంగా నిర్వహించడం తన ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు .ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన సబ్ రిజిస్ట్రార్ అజిమియాకు శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని సిపిఐ వినతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 13: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మరో మూడు నెలల గడువు పొడిగించాలని కోరుతూ సిపిఐ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ, గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రజలకు తగిన అవగాహన కల్పించకుండా ప్రక్రియను ఈ నెల 14తో ముగించడం సరైంది కాదన్నారు. అర్హులైన ఓటర్లందరికీ అవకాశం కల్పించేలా గడువును మరో మూడు నెలలు పొడిగించాలని కోరారు.మృతులు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపుపై తమకు అభ్యంతరం లేదని, అయితే అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఇంకా అనేక ఫారాలు ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడి గడువు పొడిగింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. నాగరాముడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న, డి. శ్రీనివాసులు, భూముని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**